# ఎవరి పోలిక?

అదేం ఖర్మమో మనవాళ్ళలో ఏం జరిగినా ఉపద్రవమే. నిషేధాలు జాస్తి. తుమ్మరాదు, దగ్గరాదు, నవ్వరాదు, బ్రాహ్మణుడెదురుకారాదు, ముగ్గురు పోరాదు, అమావాశ్యకారాదు, పౌర్ణమి కారాదు, ఏకాదశి కారాదు, ద్వాదశి కారాదు, అష్టమి నవమి కారాదు, మంగళవారం కారాదు, బుధవారం కారాదు, శుక్రవారం కారాదు, ఆదివారం కారాదు, శనివారం కారాదు. ఇటువంటివి కోటానుకోట్లు. ఈ విధంగా చేతులు కాళ్లూ కట్టెయ్యటంలో ఉద్దేశం ఏమిటో అర్థం కాదు. ప్రతిక్షణం ఒక కోటిరూపాయలుగా గణించే పాశ్చాత్యులకు మన నాగరికత అబ్బినట్టాయెనా చచ్చువారే! ఇటువంటి వన్నీ మతసంబంధ మైనవిగా పరిగణించబడుతున్నై. ఇక ఆచార సంబంధమైన నిషేధాలు కొన్ని ఉన్నై. వాటి ప్రచారం ఎక్కువభాగం ఆడవాళ్ల ద్వారా జరుగుతున్నది. ఒక ఉదాహరణ చూడండి:

"ఏం పిల్లమ్మా?"

"ఆడపిల్ల!"

"హుఁ! అదే మంచిదే! మహలక్ష్మి ప్రసన్నం!" అనునయింపేకాని ఆమోదింపుకాదని తెలుస్తూనే ఉంటుంది. ఈ మొహమాటం కూడా ఒకరిద్దరాడపిల్లలవరకే. మూడో ఆడపిల్లకూడా పుట్టుకొచ్చిందో "ప్రారబ్ధమమ్మా! ప్రారబ్ధం ఎప్పుడు చేసిన పాపమో?" ఈ సంఖ్య అయిదయేసరికి హాస్యం కిందికి దిగుతుంది. అయినదానికీ, కానిదానికీ అన్నిటికీ ఎగతాళే! పిల్లలు అయిదారుగురుంటే ఎగతాళి లేకపోతే ఎగతాళి. ఎంతమంది పిల్లలుంటే ఎగతాళి కాకుండా తూకంగా ఉంటుందో ఎవరూ చెప్పలేరు! ఇక పోలికలు!

"పిల్ల ఎవరిపోలికమ్మ?"

"తల్లిపోలిక!"

పిల్లలకు తండ్రి పోలికా పిల్లాడికి తల్లిపోలికా రావటం మంచిదని ఒకరు చెబితే మరోరు "మాతామహుస్థానంవచ్చిపడ్డదీ? మనఖర్మంకాలి!" అంటారు. ఏది నిజంగా తీసుకోవాలో తెలీదు.

లోకంలో మరి ఎవరి నాగరికత కన్నా మన నాగరికత చాలా ప్రాచీనమైనది కాబట్టి మనం మిగిలిన దేశాలవాళ్లకంటె ఎక్కువ నాగరికత అనుభవిస్తున్నామని గర్వపడ్డం ఒకటికనిపిస్తున్నది కాని ఇట్లా ఒకరినొకరు కనపడకుండా హింసించుకోవటం ఏం నాగరికతో నాకు బోధపడకుండా ఉంది! ఇది నాగరికత అయితే నాకు దీంతో పనిలేదు.

పాపం మా స్నేహితుడు వెంకటేశ్వర్లు సంగతి చూడండి. అతనికి తొల్చూరు ఆడపిల్ల. "నీతృప్తి కోసం అంటున్నానబ్బాయి, తరువాత నీయిష్టం" అన్నట్టు స్పష్టంగా అతనికి తెలియచేస్తూ అతని చుట్టాలంతా "ఏమోరా, నాయనా! మగపిల్లలనటమేకాని తొల్చూరు ఆడపిల్లే కలగాలని మా నమ్మకం. తొల్చూరాడపిల్ల లక్ష్మి ప్రసన్నం. నువ్వదృష్టవంతుడివే! పెళ్లి సంగతి మాత్రం ఆలోచించు!" అన్నారు. ఇటువంటి అభినందనవాక్యాలతనికి తృప్తినివ్వలేదు మరి.

ఇంతకూ పిల్ల ఎవరిపోలిక అన్న అసలు సంగతి వచ్చింది.

వెంకటేశ్వర్లు తల్లినడిగితే "ఎవరి పోలికయితే ఏం? వాళ్ల పోలికే, మాకో ఆవిడ దాపరించిందిగా చిప్ప మొహం! (తన వియ్యపురాలు!)" అన్నది.

వెంకటేశ్వర్లు అప్పనడిగితే "ఏమోనే, పిన్నీ! నవ్వితే నానపోలికా, ఏడిస్తే అమ్మపోలికా! మొత్తానికి ఆముక్కూ, గడ్డం, నుదురూ, తలకట్టూ తల్లి ఊడిపడ్డట్టే ఉంటుంది!" అన్నది.

అవతలివైపున వెంకటేశ్వర్లత్త గారి నడిగితే "అప్పుడే ఏం చెప్పగలం కాని, ఇప్పటిమట్టుకు నాయనమ్మ పోలికలొకటి గట్టిగా కనబడుతున్నై. అదేం కర్మమో మొగుడూ పెళ్లాల్లో ఎవరికోతయితే వాళ్లపోలిక వస్తుంది. కాని రెండో వాళ్ల పోలిక రాదే పిల్లలకు!" అన్నది.

వెంకటేశ్వర్లు మరదలినడిగితే "తలకట్టూ, నుదురూ, గడ్డం, ముక్కూ అంతా బావపోలికే" నన్నది.

వెంకటేశ్వర్లు బావమరిది కొద్దిగా తెనాలి రామలింగడు. "ఇది ఎవరిపోలికా కావటానికి వీల్లేదు. ఎందుకంటే, మాబావ తల్లిపోలిక, పిల్లకాయ నీ పోలికలతో పాటు తల్లిపోలిక రావటం కూడా వస్తే ఇదికూడా తల్లిపోలిగ్గా ఉండాలిసొస్తుంది. ఇక మా అమ్మాయిచూస్తే అది మా నాన్నపోలిక అందుచేత ఈ తల్లిపోలిక రావటంలో పిల్లకు దాని నాన్నపోలికా రావాలిసుంటుంది. ఇక కొట్టుకుచావండి!" అన్నాడతను.

వెంకటేశ్వర్లు నల్లగా, సన్నగా, పొడుగ్గా ఉండేవాడు. అతని దవడలు చప్పిదవడలు, పెదిమలు కొంచెం మందం. కళ్లు కొద్దిగా ఇరుక్కుపోయినట్టుండేవి. మొహాన స్ఫోటకం మచ్చలు, ముక్కు తీర్చినట్టే ఉండేది. కోలమొహం, పొడుచుకొచ్చే గడ్డం. సాఫుగా నొక్కులేనిజుట్టూ. పిల్లను చూడబోతే తెల్లగా బొద్దుగా ఉండేది. గుండ్రని మొహం, అంటించినట్టున్న గడ్డం. గుండ్రనికళ్లు, బుగ్గలు చివర ఉంగరాలు తిరిగేజుట్టూ. వెంకటేశ్వర్లు భార్యదికూడా కోల మొహమే. కొంచెం పెద్దముక్కు, నవ్వితే పళ్ల చిగుళ్ళు కనబడేవి. కళ్లు వెడల్పు తక్కువా పొడుగెక్కువా జుట్టు నొక్కులజుట్టు. ఈ స్థితిలో పిల్ల ఎవరి పోలికో తేల్చటం ఎవరికీ దుర్ఘటంగానే ఉంది.

వెంకటేశ్వర్లసలు చవటరకం. అతనికి మొదట్లోనే అనుమానంతట్టింది. ఈ పిల్ల తనకు పుట్టలేదేమోనని. తన భార్యకు ఏఏ పురుషులతో సంబంధం ఉండేటందుకు అవకాశవేశం కనపడ్డవాళ్లందరితోనూ పిల్లను పోల్చి చూశాడు. అతని కర్మమేమిటో ప్రతివాడిదగ్గిరా పిల్లకవళికలు కనిపిస్తునే వచ్చింది. ముఖ్యంగా అతని అనుమానం ఎదుటింటి చలపతి మీదపడ్డది. అతని అనుమానపు కళ్లకు తనకుమార్తె చలపతి ముక్కునించి ఊడిపడ్డట్టు కనపడ్డది.

చలపతికీ తన భార్యకూ సంబంధం ఉన్నది అన్న అనుమానంతో బయల్దేరిన వెంకటేశ్వర్లు అనుమానాన్ని బలపరచగల సాక్ష్యం ఆవగింజంతైనా లేకుండానే, తను నిజంగా చూసినవాడల్లే నిజంగా సంబంధం ఉన్నదనే గట్టి నిశ్చయానికొచ్చాడు. అతనికింకో అనుమానం తట్టింది. ఇటువంటి విషయాలు లోకంయావత్తూ గ్రహించిన తరువాత అసలు మనిషికి తెలుస్తై. అటువంటి సమయంలో తను ఈ విషయం గ్రహించినట్టు లోకం కనుక్కు చెప్పలేకపోతే తన్ను వెధవ అనుకుంటారు. మనసులో పెట్టుకొని అతను వెర్రివాడల్లే ప్రవర్తించటం మొదలుపెట్టాడు. పెళ్లాన్ని కొట్టటం, తిట్టటం దరికి రానివ్వకపోవటం సాగించాడు. ఈమార్పు ఎవరికి అర్థముకాలేదు. ఆడపిల్లను కన్నందుకు తన మీద ఆగ్రహించాడనుకున్నారు. ఈ విధంగా సంవత్సరం జరిగింది. అతన్ని అందరూ ఎగతాళి పట్టించటం మొదలుపెట్టారు. భార్యకూడా మాట్లాడటం మొదలుపెట్టింది. సంసారం చాలా ఘోరంగా వుంది.

ఈ స్థితిలో పిల్ల స్ఫోటకం పడ్డది. భయంకరమైన పోత. పిల్లచావుతప్పి కన్నులొట్టబోయి బతికింది. వెంకటేశ్వర్లు పిల్లపోవాలని కోరుకున్నాడు. అతని కాయనముద్దుబిడ్డ ఎన్నడూ ముద్దురాలేదు! ఈ దెబ్బతో పిల్లలో కలిగిన మార్పు వెంకటేశ్వర్లు బాగా గమనించలేదు. ఒకరోజున ఇద్దరు బంధువులు అతను తమ మాటలు వింటున్న సంగతి తెలీక మాట్లాడుతుండగా విన్నాడు.

"పిల్ల అంతా తండ్రి పోలికా! అదేముక్కు, అదే మొహం, అప్పుడదే మచ్చలు! ఆ పిల్లది బ్రతికి బాగుంటే పెళ్లి కావటం కష్టమే! ఖర్మం!"

వెంకటేశ్వర్లు ఒక్కసారి సంతోషంతో పొంగిపోయినాడు. అయితే లోకమంతా పిల్ల తనపోలికేననుకుంటున్నారు. ఇక తన భార్యతో సుఖంగా ఉండవచ్చును. ఇప్పుడా భార్యతో సంధికి రావటం ఎట్లా?

అతని శరీరం ఒక్కసారి కొయ్యల్లే అయిపోయింది. మరివాళ్లన్నట్టు ఖర్మమే!

*మొదటి ముద్రణ : దక్కన్ కేసరి, జూలై 1934*